క్లుప్తంగా

బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల సత్తా



ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థులు బ్యాడ్మింటన్‌లో సత్తా చాటారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో 29, 30 తేదీల్లో నిర్వహించిన అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీల్లో విన్నర్‌గా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకటరావు శుక్రవారం తెలిపారు. పోటీల్లో బీపీఈడీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మన భంజన్ నాయక్, ప్రతిక్‌కుమార్‌శింగ్‌దేవ్ ప్రతిభ కనపరిచి డిసెంబరులో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో వర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులను సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాంనాయక్, ఎం.దాసు, అరవింద్ అభినందించారు.

మసీదుల అభివృద్ధికి ప్రభుత్వం చొరవ అభినందనీయం



శావల్యాపురం: నియోజకవర్గంలో 51 మసీదులు అభివృద్ధి పనులు నిమిత్తం ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు ద్వారా మసీదుకు రూ.లక్ష చొప్పున మంజూరు చేసినట్లు వక్ఫ్ బోర్డు జిల్లా మెంబరు అద్దంకి హాఫీజ్ గౌస్ బాషా తెలిపారు. శుక్రవారం మండలంలోని శావల్యాపురం, శానంపూడి, కారుమంచి, పోట్లూరు, ఇర్లపాడు, వేల్పూరు గ్రామాల్లోని మసీదులను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో మసీదు అభివృద్ధి పనుల నిమిత్తం రూ.లక్ష మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో వినుకొండ పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు పీఎస్ ఖాన్, మండల అధ్యక్షుడు దూదెకుల పెద మదార్, వేల్పూరు మస్తాన్, డి.షైదా, సీహెచ్ ఖాశింవలీ పాల్గొన్నారు.

ప్రకృతి పిలుపు కార్యక్రమం



వినుకొండ(నూజెండ్ల): ప్రకృతి పిలుపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వినుకొండ రూరల్ మండలం వెంకుపాలెం సమీపంలోని నగర వన యోజన కింద అనుమతి లభించిన వినుకొండ నగర వనంలో చెత్తను శుభ్రం చేశారు. కార్యక్రమానికి పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నగర వనాల ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వినుకొండ రేంజ్ అటవీ క్షేత్ర అధికారి సయ్యద్ హుస్సేన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పెట్లూరివారిపాలెం సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరుకు చెందిన గార్ల గోపి(35) ఒంగోలులో ఉన్న భార్యను కలిసేందుకు టీవీఎస్ వాహనంపై బయలుదేరాడు. పెట్లూరివారిపాలెం సమీపంలోకి వచ్చిన సమయంలో ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న గోపి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ ఎస్‌ఐ హజరత్తయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ తెలిపారు.

విశ్వకర్మ యోజన ఉపయోగించుకోవాలి

నరసరావుపేట: స్థానిక బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గుడిపల్లి పుల్లారావు అధ్యక్షతన జిల్లా పదాధికారుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయే మురళి నాయుడు, విశిష్ట అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల నాగేంద్ర కుమార్ యాదవ్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ బీసీల అభ్యున్నతి కోసం, ఆర్థికంగా బలపడేందుకు అపురూపమైన విశ్వకర్మ యోజన ప్రవేశపెట్టారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకునే విధంగా కమిటీ మెంబర్స్ ప్రచారం చేయాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి, బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ కో కన్వీనర్ కె.రాకేష్, ప్రవాస ప్రశిక్షణ కన్వీనర్ శెట్టి హనుమంతరావు, మాజీ జిల్లా ఓబీసీ అధ్యక్షులు అన్నపరెడ్డి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఏ గురుస్వామి, ఏరా గాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేద్దాం



సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



పేరూరుపాడు సచివాలయంలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- పేరూరుపాడులో అభివృద్ధి బ్రోచర్ ఆవిష్కరించిన వినుకొండ ఎమ్మెల్యే బొల్లా

నరసరావుపేట: ప్రతి కుటుంబానికి మేలు కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఎనిమిదో వార్డు ఇస్లాంపేట సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన ఆయనకు వార్డు ప్రజలు బాణాసంచా కాల్చి, పూలతో ఘన స్వాగతం పలికారు. సచివాలయంలో వార్డు పరిధిలో చేసిన సంక్షేమం, అభివృద్ధి పనుల వివరాలతో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డు, వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం వార్డు ప్రజలతో ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి దివంగత వైఎస్సార్, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేశారన్నారు. మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తీసుకున్న నిర్ణయంతో నరసరావుపేట మండలంలోని చినతురకపాలెంలో 29 మంది డాక్టర్లు, 200 మంది ఇంజినీర్లు అయినట్లు చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో అనేక మంది మైనార్టీలు ఉన్నత చదువులు చదువుకొని అగ్రస్థానానికి ఎదిగారన్నారు. వార్డులో 497మంది మహిళలకు రూ.1.27కోట్ల రుణమాఫీ జరిగిందని, చేయూత పథకం ద్వారా 306 మందికి ప్రతి ఏడాది రూ.18,750 చొప్పున అందజేస్తున్నారన్నారు. ఈవిధంగా సంక్షేమం ద్వారా వార్డు ప్రజలకు రూ.25.97 కోట్లు నేరుగా వారి ఖాతాలకు జమ చేయటం జరిగిందన్నారు. నవరత్నాల పథకాలు అమలు కావాలన్నా, పేద పిల్లలు బాగా చదువుకోవాలన్నా, మహిళలకు ఆర్థిక వెసులుబాటు కలగాలన్నా మళ్లీ సీఎంగా జగన్ ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జిలు షేక్ కరిముల్లా, షేక్ ఖాజా, స్వచ్ఛాంధ్ర, గిరిజన, మాదిగ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఎస్.సుజాతాపాల్, పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా, పట్టణ అధ్యక్షుడు షేక్ మహబూబుబాషా, జిల్లా కార్యదర్శి సయ్యద్‌ఖాదర్‌బాషా, పట్టణ గృహసారథుల కన్వీనర్లు ఎన్‌కే ఆంజనేయులు, మద్దిరెడ్డి నరసింహారెడ్డి, డ్వాకా సంఘ నాయకురాలు సయ్యద్ ఫాతిమా, మాజీ కౌన్సిలర్ గేరా ధర్మారావు, రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శి పాలపర్తి సామ్రాజ్యం, పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ రఫానీ, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు

ఉప్పరపాలెంలో...

వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు వినుకొండ రూరల్ మండలం ఉప్పరపాలెం గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాలను తెలియజేసే బోర్డు ఆవిష్కరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను 98 శాతానికి పైగా అమలు చేసి పేదల సంక్షేమానికి కృషి చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. రాబోయే రోజుల్లో మరలా సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ దండు చెన్నయ్య, జెడ్పీటీసీ సభ్యులు విజయలక్ష్మి రాజా, సొసైటీ చైర్మన్ అనుమోలు నాసరరెడ్డి, నాయకులు రొడ్డా పుల్లారెడ్డి, నక్కా వెంకటేశ్వరరెడ్డి, ఒంటేరు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా ఏపీ

నాదెండ్ల: దేశంలోనే ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ఏపీని సుపరిపాలన చిరునామాగా నిలిపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోమారు పట్టం కట్టాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ చెప్పారు. గణపవరం 2వ సచివాలయంలో శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. నాలుగున్నరేళ్లలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సచివాలయం పరిధిలో రూ.22,23,25,988 మేలు జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ మేలు జరిగి ఉంటేనే మద్దతు ఇవ్వండని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పటం ఈ రాష్ట్రానికి ఆయన చేసిన సంక్షేమం, అభివృద్ధి ఎంత గొప్పగా ఉందో అర్థమవుతుందన్నారు. విద్యా, వైద్య రంగాల్లో నాడు నేడు ద్వారా సమూల మార్పులు చేసి కార్పొరేట్ స్థాయిని తలదన్నేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తలహాకాన్, కౌన్సిలర్ ఆదంవలి, బేరింగ్ మౌలాలీ, జగనన్న సురక్ష నియోజకవర్గ కన్వీనర్ వై.శ్రీనివాస్, మాజీ సర్పంచి కెల్లంపల్లి సుందరరావు, నాలుగోవార్డు ఇన్‌చార్జి కాటా వెంకటేశ్వర్లు, బొప్పూడి రామారావు, ఐతా శ్రీనివాసరావు, సైదావలి, మోషే, సచివాలయ కన్వీనర్లు కాట్రు శేషుబాబు, నాగళ్ళ సాంబశివరావు, బొంతా బాబు, పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి కవిత, ఉన్నారు.

సుపరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి

బొల్లాపల్లి: సుపరిపాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మండలంలోని పేరూరుపాడులో శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తొలుత సంక్షేమ పథకాల బోర్డును, బ్రోచర్‌ను సచివాలయంలో ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయుడిగా సంక్షేమబాటలో నడిచి, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. పూర్తిస్థాయిలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలను ఆదుకున్నారని, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే ఇదే నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి మూలా స్వాతి, ఎంపీటీసీ డి.ఎలీశమ్మ, బి.గోవిందునాయక్, బి.గురవయ్య, ఎం.రాజయ్య, బి. వెంకటేశ్వరరెడ్డి, పి.అవినాష్‌రెడ్డి, వై.సూరిబాబు, ఎస్.మన్నెయ్య, జి.అంజిరెడ్డి, ఎ. కొండలురెడ్డి, షేక్ ఇమామ్‌షా, టి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆడుదాం- ఆంధ్రాలో పేర్లు నమోదు చేసుకోవాలి



పోట్లూరులో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి

శావల్యాపురం: ఆడుదాం- ఆంధ్రా కార్యక్రమంలో క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఎం.వెంకటరెడ్డి కోరారు. మండలంలోని పోట్లూరు గ్రామ సచివాలయంలో ఆడుదాం- ఆంధ్రా, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డులు యాప్‌లు నమోదుపై సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామ సచివాయాల్లో ఈనెల 14వ తేదీలోగా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా మొబైల్ యాప్‌లో ఆడుదాం-ఆంధ్రా నమోదు వేగవంతం చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో లబ్ధిదారులు నుంచి ఈకేవైసీ నమోదు నూరు శాతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి పోపూరి జ్యోతి, ఎంపీడీఓ పి.సీతారామయ్య, ఎంఈవో ఎం.సాంబశివరావు పాల్గొన్నారు.

బొల్లాపల్లి మండలంలో..

బొల్లాపల్లి: గ్రామీణస్థాయిలో యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్రా పోటీలకు యువకులు పేర్లు నమోదు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో తమ పేర్లు నమోదు చేసుకునేందుకు డిజిటల్ అసిస్టెంట్, సచివాలయ కార్యదర్శులు అందుబాటులో ఉంటారని, 1902కు ఫోన్‌కాల్ ద్వారా క్రీడా పోటీలకు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

జయహో జగనన్న పాదయాత్రకు ఘనస్వాగతం



పాదయాత్రగా వచ్చిన ఎమ్మెల్సీ రఘురాజును యడ్లపాడు సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యడ్లపాడు: 'జయహో జగనన్న చలో తిరుమల' పేరిటా విజయనగరం జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆధ్వర్యంలో ప్రారంభమైన పాదయాత్ర శుక్రవారం యడ్లపాడు చేరింది. వైఎస్సార్ సీపీ నేతలు పాదయాత్ర బృందానికి ఘనంగా స్వాగతించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తూ, సామాజిక వర్గాలకు సమన్యాయం చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నవంబర్ 8వ తేదీన పాదయాత్ర చేపట్టి 43 రోజులకు 820 కిలోమీటర్ల మేర నడిచి తిరుమల చేరుకునేలా దీక్షను చేపట్టామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోరంగి నాగమల్లేశ్వరరావు, కోడిరెక్క నాగరాజు, సర్పంచ్ గౌరు లక్ష్మయ్య, కర్నాట సుబ్బారావు, రాచమంటి వీరాంజనేయులు, దాడి వసేంద్ర, పల్లపు సేటు, సాగి బాలాజీ, మారెళ్ల జగదీష్, టైలర్ సుభాని, గోగుల ప్రసాద్, కారుచోల జార్జి, ఏదుపాటి వెంకటేశ్వర్లు, పల్లపు సాయి ఉన్నారు.

రెండో దఫా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలి

నాదెండ్ల: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండోదఫా కొలువుదీరి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు సీఎం కావాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేపట్టిన తిరుమల తిరుపతి పాదయాత్ర శుక్రవారం సాయంత్రం గణపవరం చేరింది. పాదయాత్రగా వస్తున్నారన్న సమాచారంతో వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రెండో దఫా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో పార్టీ నాయకులు విడదల గోపీ, జెడ్పీటీసీలు కాట్రగడ్డ మస్తాన్‌రావు, సుధారాణి, ఎంపీపీలు దేవినేని శంకరరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, మార్కెట్‌యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మాజీ సర్పంచి కె.సుందరరావు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే రావాలి

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు విజయనగరం నుంచి తిరుమలకు 820 కిలో మీటర్ల మేర పాదయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆయన చిలకలూరిపేటకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు విడదల గోపీ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు క్లస్టర్ -1 పఠాన్ తలహాఖాన్, క్లస్టర్ -2 విడదల కమలేంద్ర, ఎంపీపీ దేవినేని శంకరరావు, పార్టీ మండల అధ్యక్షుడు గుత్తా వేములయ్య పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధి అంతానికి రెడ్‌క్రాస్ కృషి

సొసైటీ జిల్లా చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి



నరసరావుపేట కోర్టు ప్రాంగణంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శోభారాణి

నరసరావుపేట: ఎయిడ్స్ వ్యాధి బారిన పడ్డ వారితో వివక్షత చూపరాదని, స్నేహభావంతో ఉంటూ వారిలో మనోధైర్యాన్ని నింపాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎయిడ్స్‌డే సందర్భంగా శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యాధికి గురైతే మరణం సంభవించినట్లే అని చాలామందికి అపోహలు ఉన్నాయని, పౌష్టికాహారం, క్రమం తప్పకుండా మందులు వాడటం వలన ఆరోగ్యంగా జీవితాన్ని కొనసాగించవచ్చునని అన్నారు. మెంబర్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

అవగాహనతోనే మహమ్మారిని తరిమేద్దాం

యడ్లపాడు: తెలిసీ తెలియక చేసే తప్పుల కారణంగా హెచ్ఐవీ/ఎయిడ్స్ మహమ్మారి జీవితాలను బలి తీసుకుంటుందని.. దానిపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఏటా డిసెంబర్ ఒకటో తేదీన ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని నిర్వహిస్తోందని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని తెలిపారు. మండలంలోని బోయపాలెం డైట్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో ర్యాలీ చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. చివరిగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డైట్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కే ప్రసాద్, కె అజయ్‌కుమార్, పి పోలేరు, కె యోగేశ్వరరావు, వైఎస్ రావు, ప్రభాకరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుధ పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో మెలగాలి

నరసరావుపేట టౌన్: ఎయిడ్స్ రోగులతో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో మెలగాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.శోభారాణి అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకొని శుక్రవారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ఎయిడ్స్ రోగుల పట్ల ఎటువంటి వివక్షత చూపరాదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్యసౌకర్యాలను వినియోగించుకొని జీవితకాలం పెంచుకోవచ్చు అన్నారు. చట్టపరంగా ఎటువంటి సేవలు కావాలన్నా మండల న్యాయ సహాయ కేంద్రం ద్వారా ఉచితంగా అందిస్తామన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

నరసరావుపేట ఈస్ట్: స్వచ్ఛంద సంస్థలు గ్రామ గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి హెచ్ఐవీ నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల వద్ద నుంచి ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని డాక్టర్ రవి, డీఎల్ఏటీవో మురళీ కృష్ణ ప్రారంభించారు. అనంతరం పీఎన్‌సీ లండ్ కేఆర్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో హెచ్ఐవీ నిర్మూలనకు ప్రభుత్వ ఆరోగ్య శాఖ చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎల్.మధుసూదనరావు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ సంస్థల సహకారంతో హెచ్ఐవీ నిర్మూలన సాధ్యం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో కేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలకృష్ణ, ఆర్ఎంఓలు దయానిధి, చిలకలూరిపేట గవర్నమెంట్ హాస్పిటల్ ఆర్ఎంఓ అమృతవల్లి, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ అంజని, డాక్టర్ హనుమకుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఎస్‌జీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల నుంచి మార్కాపురం రోడ్డులోని చెక్‌పోస్టు సెంటర్ వరకు కళాశాల ర్యాలీ, మానహారంగా ఏర్పడి ప్రజలకు, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జి.అంజయ్య, ఆర్ఆర్‌సీ కోఆర్డినేటర్ బీఆర్‌కే కిషోర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ఈపూరు: ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా మండల కేంద్రమైన ఈపూరులో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ వై.లక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు కమలాకర్, మాధవి, రాంబాబు, శ్రీనాథ్, కాంత్, సునీత, హేమలత, ఐసీటీసీ సెంటర్ ప్రతినిధి సీహెచ్. నాగరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చండి



కలెక్టరేట్ వద్ద డీఈఓ శామ్యూల్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నరసరావుపేట: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) నాయకులు కోరారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఉద్యమ కార్యాచరణపై శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ వినతిపత్రాలు అందజేశారు. బదిలీలు, ప్రమోషన్లు తక్షణం నిర్వహించాలని, మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అన్ని పోస్టులు అప్ గ్రేడ్ చేయాలని, మున్సిపల్ టీచర్లకు పీఎఫ్ సౌకర్యం వెంటనే కల్పించాలని, మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు కొత్త డీడీఓల ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించాలని, పాఠశాలల అన్నింటికీ బోధనేతర సిబ్బందిని నియమించాలని, భవనాల అద్దె, కరెంట్ బిల్లులు చెల్లించాలని, అన్ని రకాల బకాయిలు వెంటనే చెల్లించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి, గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి, సహాధ్యక్షులు ఎం.మోహనరావు, కోశాధికారి వాల్యానాయక్, కార్యదర్శులు తిరుపతిస్వామి, ఉషాశౌరిరాణి టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


గాయపడిన మహిళ మృతి

నాదెండ్ల: గణపవరం హైవేపై గురువారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ శుక్రవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గణపవరం రాజీవ్‌గాంధీకాలనీకి చెందిన సుంకర సుశీల(45) రోడ్డు దాటుతుండగా గుంటూరు వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. సాతులూరు గ్రామానికి చెందిన జి.ఏసుబాబు గ్రామ పెదకాపుగా పూజలు నిర్వహిస్తుంటాడు. గత ఆదివారం అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించేందుకు పూజా సామగ్రిని తెచ్చే క్రమంలో స్కూటీపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు రెడ్డి సంఘం కార్తిక వనసమారాధన



వినుకొండ(నూజెండ్ల): శ్రీ యోగి వేమారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని సేవా సమితి భవన్‌లో రెడ్డి కార్తిక వనసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సేవా సమితి అధ్యక్షులు ఆరె శివారెడ్డి తెలిపారు. పట్టణంలోని సేవా సమితి భవన్‌లో వనసమారాధన కరపత్రాలను సమితి నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ యమునారెడ్డి ఆధ్వర్యంలో చెవి, ముక్కు, గొంతు పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో సమితి సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, ట్రెజరర్ రామిరెడ్డి, ఎడ్యుకేషన్ ట్రస్ట్ కన్వీనర్ చెన్నకేశవరెడ్డి, సంఘ పెద్దలు గంధం బాలిరెడ్డి, కొత్త కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రేపు రజక కార్తిక వనసమారాధన

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలోని శ్రీ బాలాత్రిపుర సుందరీసమేత శంకరస్వామి దేవస్థాన ఆవరణలో ఆదివారం రజక కార్తిక వన సమారాధన నిర్వహించనున్నట్లు సంఘం మండల నాయకులు శుక్రవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా రజక సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు పి.అంజిబాబు హాజరవుతారని చెప్పారు.

ది పీటీడీపీ వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్‌కు రాష్ట్ర గుర్తింపు

వినుకొండ(నూజెండ్ల): ది పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రిజిస్టర్ నెం.46/2020 ఏపీపీటీడీలోని సంఘానికి రాష్ట్ర గుర్తింపు ఇచ్చిన సందర్భంగా స్థానిక వినుకొండ ఆర్టీసీ డిపోలో అసోసియేషన్ గౌరవాధ్యక్షురాలు కౌన్సిలర్ షేక్ షకీలా దస్తగిరి డిపో మేనేజర్ బాణావత్ కోటేశ్వరనాయక్‌కు గుర్తింపు పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా కమిటీని ఆమె పరిచయం చేశారు. అనంతరం మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వినుకొండ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు దుబ్బల నాగరాజుకుమార్, కార్యదర్శి ఇనగంటి ఆంజనేయులు, ఎస్కే ముజీర్, వై.శేషయ్య, మరియన్న, ఎంతఈ కొండలు, కోటిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బాబు, అంకయ్య, వెంకటరెడ్డి, సుందరరెడ్డి పాల్గొన్నారు.

83 శాతం పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో రెండో రోజు గురువారం వైఎస్సార్ పెన్షన్ కానుక – సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ 83 శాతం పూర్తయింది. వలంటీర్లు ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ నగదు అందించారు. మండల పరిధిలో 9661 మంది లబ్ధిదారులకు గాను రూ.2,66,46,750 పంపిణీ చేయాల్సి ఉంది. ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్, ఆయా సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు.

ఘనంగా నాసరయ్య ఉరుసు ఉత్సవాలు

బొల్లాపల్లి: మండలంలోని కనుమలచెరువు గ్రామంలో నాసరయ్య ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకొని పొంగళ్లతో నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. గ్రామంలో నాలుగు భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు.

నవదిన ప్రార్థనలతో శౌరి వారి ఉత్సవాలు ప్రారంభం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న రెవ.ఫాదర్ తంబిరాజు, సర్పంచి ప్రభాకర్

బొల్లాపల్లి: మండలంలోని రెడ్డిపాలెంలో పునీత ఫ్రాన్సిస్ శౌరి వారి మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెవ.ఫాదర్ తంబిరాజు ఆధ్వర్యంలో తొలి రోజు నవదిన ప్రార్థనలతో ప్రారంభమయ్యాయి. అనంతరం భక్తులు ప్రార్థనలు చేశారు. సాయంత్రం డ్యాన్స్ బేబి డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. మహోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తామని విచారణ గురువు తెలిపారు.

వాలీబాల్ పోటీలు...

పునీత ఫ్రాన్సిస్ శౌరివారి మహోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని రెడ్డిపాలెంలో శుక్రవారం రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు సుమారు 15 టీమ్‌లు నమోదు చేసుకున్నాయని నిర్వాహకులు తెలిపారు. తొలి రోజు పోటీలను రెవ.ఫాదర్ తంబిరాజు, గ్రామసర్పంచి కె.ప్రభాకర్‌లు ప్రారంభించారు. 3వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని, గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, 4వ బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు కె.ప్రకాశరావు, సీహెచ్ రాజేశ్వరరావు తెలిపారు.

వృద్ధాశ్రమంలో వన సమారాధన

చిలకలూరిపేట: వృద్ధాశ్రమంలో కార్తిక వన సమారాధన ఏర్పాటు చేయడం అభినందనీయమని కొమరవల్లిపాడు వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు కొండవీటి ఆంజనేయులు చెప్పారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కుమ్మర శాలివాహన మొల్లమాంబ ట్రస్టు అధ్యక్షుడు స్టీల్ అంజి, శాలివాహన సంఘ నాయకుడు నిడమానూరు వెంకట్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాయి ప్రశాంతి వృద్ధాశ్రమంలో వన సమారాధన, వృద్ధులకు అన్నదానం శుక్రవారం నిర్వహించారు.